# ఆదికాండము నందలి మూల పురుషుల జీవితాల నుండి కొన్ని ప్రాథమిక సత్యాలు

పిల్లలకు బోధించేవారు **P2b1** తప్పక చదవాలి

**1. మీ మనస్సును మరియు హృదయాన్ని దేవుని వాక్యంతో సిద్ధపర్చుకొండి.**

మీరు ఈ పాఠమంతటినీ ఒకేసారి అధ్యయనం చేయవచ్చు లేదా వారానికి ఒకరిద్దరు మూల పురుషుల చొప్పున అధ్యయనం చేస్తూ చాలా వారాలు కొనసాగించవచ్చు.

**ప్రార్థన :** దేవా, శాశ్వత సత్యాన్ని మనుషులు ఏ విధంగా అర్థం చేసుకోగలరో మా మూలపురుషుల జీవితాల నుండి నేర్చుకోవడానికి సహాయం చేయి.


**a) ఆదాము :** క్రొత్తగా సృష్టించబడిన సృష్టిలో ఆదామును సాతాను శోధించినప్పుడు అతడు పాపం చేశాడు. ఆదికాండము 1-3 అధ్యాయాలు చదవండి.

- **ప్రాథమిక సత్యం :** ఆదాము పాపము చేయడం ద్వారా ఈ లోకంలోకి పాపాన్ని మరియు మరణాన్ని తెచ్చాడు గనుక ప్రతి ఒక్కరు పాపం చేస్తారు. రోమా 5:12-21 చదవండి.
- **ఈ ప్రశ్నలను చర్చించండి :** సాతాను హవ్వను శోధించినప్పుడు ఏమని వాగ్దానం చేశాడు? పాపం ఎందువల్ల అంత ఆకర్షణీయంగా ఉండింది? (జవాబు : ఆ పండు తిన్నప్పుడు ఆమె మరణించదు గాని దేవుని వంటి జ్ఞానాన్ని పొందుతుందని సాతాను అబద్ధం చెప్పాడు)



**b) నోవహు :** నోవహు దేవునికి విధేయుడై నీటిమీద తేలుచున్న ఒక పెద్ద పెట్టెను తయారు చేశాడు. దానినే "ఓడ" అంటారు. దానిలో అతని కుటుంబం, మరియు అన్ని రకాల జంతువులు, జలప్రళయం నుండి రక్షించబడ్డారు. ఆది.కా.6-9 అధ్యాయాలు.

- **ప్రాథమిక సత్యం :** దేవుడు పాపులను శిక్షిస్తాడు. కాని తనకు లోబడే వారిని శేషంగా ఉండనిస్తాడు. నోవహు సమయంలో దేవుడు ఈ లోకానికి విధించిన శిక్షతో యేసు తుది తీర్పును పోల్చాడు. మత్తయి 24:37-42.
- **చర్చించవల్సిన ప్రశ్నలు :** మనకు జీవం ఇవ్వడానికై యేసు తిరిగి జీవించడానికి నోవహు ఓడ ఏ విధంగా పోలి ఉంది? (జవాబు : క్రీస్తు మనకు నూతన జీవమిస్తాడు. మనమాయన శరీరం. మనమాయనలో ఉన్నాం. ఎలాగంటే నోవహు మరియు అతని కుటుంబం ఓడలో ఉండడం ద్వారా మరణాన్ని మరియు శిక్షను తప్పించుకొన్నట్టుగా అన్నమాట)



**c) అబ్రాహాము :** దేవుని వాగ్దానాలు నమ్మాడు. దేవుడతనితో ఒక నిబంధన చేశాడు. ఆదికాండం 12-26. దేవుని వాగ్దానాలను నమ్మినప్పుడు, అన్ని దేశాల ప్రజలు అబ్రాహామువలె ఆశీర్వదించబడతారు.

అబ్రాహాము సంతానం ద్వారా అన్ని జనాంగాలను ఆశీర్వదిస్తానన్న దేవుని వాగ్దానం కొరకు ఆది 12:1-7 చూడండి.

తన అన్న కుమారుడైన లోతును చెరపట్టుకొని పోయిన ఐదుగురు అన్యరాజులను అబ్రాహాము ఎలా జయించాడో 14వ అధ్యాయంలో చూడండి.

దేవుడు తన వాగ్దానాన్ని ఒక ఆశ్చర్యకరమైన ఆచార క్రియ ద్వారా ఎలా నిర్ధారించాడో 15వ అధ్యాయంలో చూడండి.

లోతు కొరకు మరియు అతని కుటుంబం కొరకు అబ్రాహాము దేవునినెలా వేడుకొన్నాడో 18వ అధ్యాయంలో చూడండి.

దేవుడు దుష్టత్వంతో నిండిన సొదొమ నగరాన్ని ఎలా నాశనం చేశాడో 19వ అధ్యాయంలో చూడండి.

- **ప్రాథమిక సత్యం :** దేవుడు అబ్రాహామును మన ఆత్మీయ తండ్రి అన్నాడు గనుక మన విశ్వాసాన్ని బట్టి ఆయన మనలను అంగీకరిస్తాడు. గలతీ 3:6–9.
- **ఈ ప్రశ్నలను చర్చించండి :** మనుషులు విశ్వాసముంచడం ద్వారా రక్షించబడతారా? లేక వారి క్రియలను బట్టి రక్షణను సంపాదించుకొంటారా?

*(జవాబు : మన విశ్వాసం మరియు ఆయన దయను బట్టి దేవుడు మనలను రక్షిస్తాడు. అంతేగాని మన మంచి పనులను బట్టి కాదు. అయితే విశ్వాసాన్ని బట్టి మనం మంచి పనులు చేస్తాము)*

**d) ఇస్సాకు :** పిల్లలను కనే వయస్సు దాటిన అబ్రాహాము, శారాలకు అద్భుత రీతిలో జన్మించిన వాగ్దాన పుత్రుడు. ఆదికాండము 21–28; 22వ అధ్యాయంలో దేవుడు అతని కుమారున్ని బలిగా అర్పించమని అబ్రాహాముకు చెప్పాడు. దేవుడు అబ్రాహాము విశ్వాసాన్ని పరీక్షించాడు. ఎందుకంటే ఇస్సాకు అబ్రాహాముకు వారసుడౌతాడనీ అతని ద్వారా తన వాగ్దానాన్ని నెరవేరుస్తానని అంతకు ముందు దేవుడు అబ్రాహాముతో చెప్పాడు.

24వ అధ్యాయంలో అబ్రాహాము సేవకుడు ఇస్సాకు కొరకు భార్యను వెదకడానికి ఎలా వెళ్ళాడో చూడండి. ఒక్కడే అయిన అద్వితీయ దేవుని యందు నమ్మకముంచే కన్యకను అతడు తేవాలనుకున్నాడు.

- **ప్రాథమిక సత్యం :** దేవుడెప్పుడూ తన వాగ్దానాలు నెరవేరుస్తాడు. కొంతమంది వాటిని సందేహించినా సరే! తనకు వాగ్దానం చేయబడిన వారసుని కొరకు ఎదురుచూసి అలసిపోయిన అబ్రాహాము తన స్వంత ప్రయత్నాల ద్వారా దేవుని వాగ్దానాన్ని నెరవేర్చడానికి ప్రయత్నించాడు. ఫలితంగా ఇష్మాయేలు జన్మించాడు. అతడు అరబ్బీయులకు మూల పురుషుడు. వారు ఇస్లామ్ మతాన్ని పాటిస్తారు, మరియు స్వంత ప్రయత్నాల ద్వారా లేదా క్రియల ద్వారా రక్షించబడతామని వారు నమ్ముతారు. (గలతీ 4:21–31)
- **ఈ ప్రశ్నలను చర్చించండి :** దేవుడు అబ్రాహాము విశ్వాసాన్ని ఏ విధంగా పరీక్షించాడు?

*(జవాబు : తన కుమారున్ని బలిగా అర్పించమని దేవుడు అబ్రాహాముకు చెప్పాడు. తనకు లోబడడానికి అబ్రాహాము ఇష్టపూర్వకంగా సిద్ధపడడం చూసిన దేవుడు ఇస్సాకు స్థానంలో మరణించడానికి ఒక పొట్టేలును ఇచ్చాడు. హెబ్రీ 11:17–19 ఏమి వివరిస్తుందంటే, దేవుడు ఇస్సాకును మరణం నుండి తిరిగి లేపగల సమర్థుడని అబ్రాహాము నమ్మాడు)*

ఆ పొట్టేలు ఏ విధంగా క్రీస్తుకు ముంగుర్తుగా ఉంది?

*(జవాబు : ఆ పొట్టేలు నిర్దోషమైనది. మరొకరిని రక్షించడానికి దాని రక్తం చిందించబడింది. గనుక పాతనిబంధనలోని ఇతర వ్యక్తులు మరియు సంఘటనలవలె క్రీస్తు ఈ లోకానికి రాకముందు క్రీస్తుకు గుర్తుగా ఆ పొట్టేలు ఉంది. యేసు వచ్చినప్పుడు ఆయనను స్వీకరించడానికి మనుషులను సిద్ధపర్చడానికై ఈ ముంగుర్తులు లేదా ఉదాహరణలు ఉద్దేశించబడ్డాయి)*



**e) యాకోబు :** యాకోబు దేవుని దీవెనలను కోరుకొన్నాడు. దేవుడు యాకోబు పేరును ఇశ్రాయేలుగా మార్చాడు. అతని పన్నెండుగురు కుమారుల సంతానమే ఇశ్రాయేలులో పన్నెండు గోత్రాలయ్యాయి. ఆదికాండము 25–49.

యాకోబు తన అన్నయైన ఏశావును ఏ విధంగా మోసగించి అతని జ్యేష్ఠత్వాన్ని అపహరించాడో దానివల్ల ద్వితి 12:15–17లో చెప్పబడినట్లుగా అతనికి రెండింతల వారసత్వం ఎలా సంక్రమిస్తుందో ఆది.కా. 25:21–34లో చూడండి.

- **ప్రాథమిక సత్యం :** దేవుని కృప మరియు ప్రేమతో కూడిన క్షమాపణ మన మంచి పనుల మీద ఆధారపడి ఉండదు. రోమా 9:1–16లో వివరించబడినట్టుగా యాకోబు అబద్ధాలు చెప్పి మోసగించినా దేవుని ఆశీర్వాదాలను పొందాడు.
- **ఈ ప్రశ్నలను చర్చించండి :** యాకోబు చేసిన చెడు పనులేవి. మంచి పనులేవి? *(జవాబు : యాకోబు ఏశావు యొక్క ఆకలిని ఆసరా చేసుకొని అతని జేష్ఠత్వాన్ని అపహరించాడు తద్వారా రెండురెట్లు ఆశీర్వాదాలు వారసత్వంగా పొందాడు. అతడు మంచి పనులు కూడ చేశాడు. అతడు మనస్ఫూర్తిగా భక్తి ప్రపత్తులతో దేవుని సేవించాడు మరియు తన కిష్టమైన రాహేలు అనే యువతిని భార్యగా పొందడానికి అనేక సంవత్సరాలు కష్టపడి పనిచేశాడు)*

**f) యోసేపు :** అతని సోదరులు ఈర్ష్యతో అతన్ని బానిసగా అమ్మేశారు. ఆదికాండము 37–50. అతన్ని అమ్మేసిన తర్వాత కౄరమృగాలు అతన్ని చీల్చివేశాయని తమ తండ్రితో చెప్పారు. మరికొంత మంది యోసేపుపై నిందలుమోపి చెరసాలలో వేయించారు. ఆది–39. తర్వాత యోసేపు దేవునితో నడిచిన నడక ఫలితంగా దేవుడతన్ని అత్యున్నత స్థానానికి హెచ్చించాడు. ఆది.కా. 40–41. ఆ తర్వాత యోసేపు తన అన్నలను వారి కుటుంబాలను కరువు నుండి రక్షించాడు. ఆది.కా. 42–45.

- **ప్రాథమిక సత్యం :** దేవుడు ఒక రక్తసంబంధీకుని ద్వారా తన ప్రజలను రక్షించాడు. ఆ పనిచేయగల స్థాయిలో ఉన్న లేదా సామర్థ్యమున్న బంధువు ద్వారా ఆయన వారిని కాపాడాడు. క్రీస్తే మనకు బంధువు. మనలను రక్షించడానికి మరణించిన పాపరహితుడైన వ్యక్తి ఆయన. హెబ్రీ 2:10–18.
- **ఈ ప్రశ్నలను చర్చించండి :** యోసేపు జీవితం ఏ విధంగా క్రీస్తు జీవితాన్ని పోలి ఉంది? *(జవాబు : యోసేపు, ఇశ్రాయేలు (యాకోబు) యొక్క నిజమైన సంతానం కాని, ద్వేషంచేత అతడు తిరస్కరించబడ్డాడు. అతని తండ్రి అతన్ని అమితంగా ప్రేమించాడు. అతడు తండ్రికి విధేయుడయ్యాడు. అతని స్వంతవారే అతన్ని అమ్మేశారు. (క్రీస్తును యూదా అమ్మినట్టుగా) అతడు ఐగుప్తుకు తీసుకొనిపోబడ్డాడు. నిందలు మోపబడి బంధించబడ్డాడు. తర్వాత అత్యున్నత స్థానానికి ఎదిగి రాజు కుడిచేతి వైపు స్థానాన్ని ఆక్రమించాడు. ఆ శక్తిగల స్థానంలో ఉండి తనను తృణీకరించిన సోదరులనతడు రక్షించాడు. ఒక గొప్ప విందులో ఎంతో ఉజ్జ్వలమైన తీరులో తానెవరో అతడు తెలియపర్చుకొన్నాడు.*



**2. మీ జత పనివారితో కలిసి రాబోయే వారంలో మీరు మరియు మీ విశ్వాసుల గుంపు చేపట్టబోయే కార్యక్రమాలను రూపొందించుకొండి.**

ఇంకా యేసు నెరుగని తమ బంధువుల మరియు స్నేహితుల ఇండ్లను దర్శించడానికి ఇద్దరు లేదా ముగ్గురు ఒక జట్టుగా ఏర్పడి మూల పురుషులను గూర్చిన కథలు వారికి చెప్పడంలో సహాయ పడండి.

**3. మీ జతపనివారితో కలిసి ఆరాధనా కార్యక్రమాన్ని రూపొందించుకొండి.**

మూల పురుషులను గూర్చిన లేదా పితరులను గూర్చిన కథలను సంఘానికి చెప్పండి. వారి చరిత్రను వివరించండి. పాఠంలో వివరించబడిన మూల పురుషుల జీవితాలనుండి ఒకటి లేదా రెండు జీవితాలను ఎన్నుకొని అధ్యయనం చేయండి.

మూల పురుషులను గూర్చిన ప్రాథమిక సత్యాలు వివరించండి.

చర్చ కొరకు ఇవ్వబడిన ప్రశ్నలను అడగండి. అందరూ వారి వారి అభిప్రాయాలు చెప్పేదాకా వారికి అసలు జవాబు చెప్పకండి.

ఆదికాండము 15:6ను **కంఠస్థం చేయండి.**

**ప్రభురాత్రి భోజనం** పరిచయం చేయడానికి యోసేపు తనను అమ్మివేసిన అన్నదమ్ములకు ఒక విందు చేశాడని చెప్పండి. వారతన్ని గుర్తుపట్టలేదు కాని అతడు వారిని క్షమించి తానెవరో తెలియజేసుకొన్నాడు. మనం కూడ మహిమలో యేసును ముఖాముఖిగా చూస్తూ ఆయనతో విందు భోజనం చేస్తాం.

Copyright © 2004 by Paul-Timothy. May be freely copied. Download from www.Paul-Timothy.net